క్లుప్తంగా

ఏబీఎం ఆస్తి మిస్సమ్మ బంగ్లాపై వివాదం



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని నరసరావుపేట రోడ్డులోని ఏబీఎం ఆస్తి మిస్సమ్మ బంగ్లా స్థలం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఆ స్థలం తమదేనంటూ కొంతమంది వ్యక్తులు అక్కడికి చేరుకోవడంతో పాటు తమ వద్ద దస్తావేజులు ఉన్నాయంటూ బయట పెట్టారు. ఈ విషయం తెలుసుకున్న వినుకొండకు చెందిన ఎస్సీ నాయకులు కొంతమంది స్థలం వద్దకు చేరుకున్నారు. ఇరువర్గాల మధ్య ఘర్షణ జరగకుండా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని అక్కడి నుంచి ఇరువర్గాలను పంపించి వేశారు. ఇలా తమదంటే తమదంటూ ఏబీఎం ఆస్తులపై ఒకరి తరువాత ఒకరు వస్తుండటంతో అధికారులు కూడా తలలు పట్టుకుంటున్నారు. అయితే ఇప్పుడు ఇలా మరికొంతమంది స్థలం తమదేనంటూ రావడం చర్చనీయాంశంగా మారింది.

'చిక్కి'పోలేదు కదా?!



నాదెండ్ల: మండలంలోని ఎండుగుంపాలెం ఎస్సీ కాలనీలో ఐసీడీఎస్ అధికారులు శనివారం పర్యటించారు. ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ సెంటర్‌లో అంగన్‌వాడీ కేంద్రం ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న వేరుశనగ చిక్కీల్లో పురుగులు ఉన్నాయంటూ వచ్చిన ఫిర్యాదుపై స్పందించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఉషారాణి, కార్యకర్త విజయరాణిలతో మాట్లాడారు. కాలనీలో చిక్కీలు పొందిన లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లారు. చిక్కీల్లో పురుగులు ఉన్నాయా అంటూ ప్రశించారు. అయితే లబ్ధిదారులు చిక్కీలు నాణ్యంగా ఉన్నాయని తెలిపారు. దీనిపై ఐసీడీఎస్ అధికారులకు నివేదిక పంపనున్నట్లు ఆమె తెలిపారు.

విద్యార్థినికి ఆర్థిక సహాయం



నరసరావుపేట ఈస్ట్: బొల్లు రాజేశ్వరి కృష్ణారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం బొప్పూడి గ్రామానికి చెందిన ఐనాల వనితలక్ష్మికి రూ.25 వేలు ఆర్థిక సహాయం అందించారు. వనితలక్ష్మి కాకినాడలోని రంగరాయ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతోంది. చదువుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకి కాకుడదనే ఉద్దేశ్యంతో విద్యార్థినికి ఆర్థిక సహాయం అందచేసినట్టు ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ వైస్‌చైర్మన్ బొల్లు వెంకటేశ్వర్లు, సభ్యులు కోమటినేని నాసరయ్య, బీవీపీఎల్ వరప్రసాద్, మర్లపాటి రామకృష్ణ, జాస్తి. గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం

నరసరావుపేట: పట్టణంలోని ప్రకాష్‌నగర్ 60 అడుగుల రోడ్డులోగల పార్టీ కార్యాలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శనివారం స్పష్టం చేశారు. నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరైజయప్రదం చేయాలని కోరారు.

ఎంఈవో తనిఖీ

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామంలో ఎస్సీ కాలనీ ఎంపీపీ స్కూలు ఎంఈవో మద్దికుంట సాంబశివరావు శనివారం సందర్శించారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు బలోపేతానికి ఉపాధ్యాయులు తమవంతు కృషి చేయాలన్నారు. ఆయనతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనివాసరావు, దేశబోయిన రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కనమర్లపూడిలో తుది దశకు రీసర్వే

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి రెవెన్యూ గ్రామంలో రీసర్వే పనులకు సంబంధించి రికార్డు పనులు పూర్తిచేసి అనంతరం ఫామ్ 9 (2) నోటీసులను రైతులకు అందజేసినట్లు తహసీల్దారు షేక్ జాన్‌సైదులు శనివారం తెలిపారు. 2800 సర్వే నంబర్లు గుర్తించి రైతులను నుంచి వచ్చిన అభ్యంతరాలు క్షేత్రస్థాయిలో విచారణ చేసిన అనంతరం ఆర్డీవో లాగిన్ పంపినట్లు చెప్పారు. ప్రస్తుతం జాయింట్ కలెక్టరు లాగిన్‌కు వచ్చినట్లు చెప్పారు.

ఆలయ వార్షికోత్సవం నేడు

రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్లలో గల షిర్డీ సాయిబాబా ఆలయ 24వ వార్షికోత్సవం ఆదివారం జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు.

రేపటి నుంచి ఉచిత యోగ శిక్షణ

నరసరావుపేట ఈస్ట్: శ్రీ వెంకటేశ్వర యోగ సేవాకేంద్రం నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీ సోమవారం నుంచి నెల రోజుల పాటు ఉచిత యోగ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు యోగాచార్యులు కూనిశెట్టి వెంకట జనార్థన్ శనివారం తెలిపారు. శ్రీ పట్టాభిరామ స్వామి ఆలయంలోని వేంకటేశ్వర కల్యాణ మండపంలో ప్రతిరోజు ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. శిబిరంలో 42 యోగ భంగిమలు, ప్రాణాయామం, ధ్యానం, ఆహార నియమాలు, సూర్య నమస్కారాలు బోధిస్తామన్నారు.

పరీక్షా సమయం!

- నూరు శాతం ఉత్తీర్ణతకు కసరత్తు
- మంచి ఫలితాల సాధనకు కృషిచేస్తున్న ఉపాధ్యాయులు
- గ్రేడ్‌లు వారీగా టెన్త్ విద్యార్థులకు బోధన



ఉపాధ్యాయుల పర్యవేక్షణలో సాగుతున్న పదోతరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతులు

శావల్యాపురం: పదవ తరగతి పరీక్షల్లో సత్తా చాటుకునేందుకు మండలానికి చెందిన విద్యార్థులు సమాయత్తమవుతున్నారు. ఏప్రిల్ 3 నుంచి పరీక్షలు ఆరంభం అవుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు ఎక్కువ సమయం చదువుకునేందుకు కేటాయిస్తున్నారు. వీరికి ఉపాధ్యాయులు కూడా సహకరిస్తూ... తమ స్వీయ పర్యవేక్షణలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. నూరుశాతం ఫలితాలు సాధన కోసం కావల్సిన ప్రణాళికలను ముందుగా తయారు చేసి ఆ దిశగా విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నారు. పరీక్షల సమయం దగ్గర పడుతుండటంతో ముందుగా నిర్వహించిన పరీక్షల మార్కులు ఆధారంగా విద్యార్థులను గ్రేడ్‌లుగా విభజించి ప్రత్యేక తరగతులు ద్వారా తర్ఫీదు ఇస్తున్నారు. ఏఏ సబ్జెక్టులలో వారికి ఇబ్బంది ఉంది? ఎక్కడ వారు ఆ ఇబ్బందిని అధిగమించలేకపోతున్నారన్న విషయాన్ని పసిగట్టి వారికి కావల్సిన సలహాలను, సూచనలను ఉపాధ్యాయులు అందజేస్తున్నారు. అదేవిధంగా పదోతరగతి విద్యార్థులపై ఒత్తిడి తగ్గించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఆరు సబ్జెక్ట్స్‌కు కుదింపు చేసింది. సదరు ఆరు పరీక్షల్లో మెరుగైన ఫలితాల సాధనకు ప్రభుత్వం ప్రతి విద్యార్థికి సాయంత్రం సమయంలో పోషకాహారం కూడా అందజేస్తున్నారు. పల్నాడు జిల్లాలో 127 పరీక్ష కేంద్రాలు ఎంపిక చేయగా, 433 స్కూల్స్‌లో 24 వేల 441 మంది బాల బాలికలు ఫైనల్ పరీక్షలు రాయనున్నారు.

ప్రణాళిక ప్రకారం చదవాలి



పదో తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించ డానికి దస్తూరి బాగుండాలి. ఉపాధ్యాయులు సూచనలు మేరకు ప్రణాళిక ప్రకారం చదువుకోవాలి. సబ్జెక్ట్సు వారీగా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలి. ఆందోళన పడాల్సిన పనిలేదు. ఒత్తిళ్లకు గురికాకుండా ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ బోధించిన అంశాలను ప్రణాళికబద్ధంగా చదివితే మంచి ఫలితాలు వస్తాయి.

–జంగాల అనిత, ప్రధానోపాధ్యాయురాలు, వేల్పూరు జెడ్పీ హైస్కూలు

సూచనల ప్రకారం చదువుతున్నా



ఉపాధ్యాయుల సూచనల ప్రకారం చదువుతున్నా. ఇప్పటికే పాఠశాలలో సబ్జెక్టుల వారీగా ఉదయం సాయంత్రం సమయాల్లో ఉపాధ్యాయులు పత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పదో తరగతి పరీక్షలు మంచి మార్కులు సాధించి పాఠశాలకు గ్రామానికి మంచి పేరు తెస్తా.

–మెడబలిమి గీష్మా, విద్యార్థిని, పోట్లూరు

పాఠాలు రివిజన్ అవుతున్నాయి



ప్రత్యేక తరగతుల వల్ల మాకు ఎంతో ఉపయోగం ఉంది. పాఠ్యాంశాల రివిజన్‌తోపాటు మరెన్నో విషయాలు ఇక్కడ తెలుసుకుంటున్నా. అలాగే ప్రభుత్వం సాయంత్రం సమయంలో అందజేస్తున్న పోషకాహారం చాలా బాగుంది. ఈవిధానం చాలా చక్కగా ఉంది. ఆరోగ్య సూత్రాలు కూడా ఉపాధ్యాయులు వివరిస్తున్నారు.

–కరసాల డేవిడ్ చరణ్, విద్యార్థి, శావల్యాపురం

సవాలు స్వీకరిస్తున్నా..

- ఆరోపణలకు ఆధారాలు చూపించు
- ఎక్కడికైనా చర్చకు వచ్చేందుకు సిద్ధమే
- నిరూపిస్తే రాజీనామా చేస్తా !
- అరవింద బాబుకు ఎమ్మెల్యే గోపిరెడ్డి సవాల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: 'సవాలును స్వీకరిస్తున్నా.. చేసిన ఆరోపణలకు ఆధారాలు చూపించాలని' ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చదలవాడ అరవిందబాబును డిమాండ్ చేశారు. ఎక్కడికైనా తాను మీడియా సమక్షంలో చర్చకు వచ్చేందుకు సిద్ధమని ప్రకటించారు. శనివారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరోనాకు కేంద్ర ప్రభుత్వం నరసరావుపేటకు రూ.20 కోట్లు రెండు దఫాలుగా ఇచ్చిందనే ఒక్క జీవోకాని, ఆధారం కాని చూపిస్తే తాను ఇప్పటికిప్పుడే తన పదవికి రాజీనామా చేస్తానని ఎమ్మెల్యే గోపిరెడ్డి సవాల్ విసిరారు.ఆక్సిజన్ సిలిండర్లను అమ్ముకున్నట్లు, అసైన్డ్ ల్యాండ్‌ను కబ్జా చేసినట్టు, బాలకోటిరెడ్డి హత్యలో తన ప్రమేయమున్నట్లు, పురపాలకసంఘంలో తాను అవినీతికి పాల్పడుతున్నట్లు అరవిందబాబు చేస్తున్న ఆరోపణల్లో ఒక్కదానిలో ఆధారాలు చూపించాలని డిమాండ్ చేశారు. తాను బాలకోటిరెడ్డి హత్యలో తన ప్రమేయంపై సాక్ష్యం చూపించాలని సవాల్ విసిరితే దానిని డైవర్టు చేసేందుకు అనేక అర్థం, ఆధారాలు లేని ఆరోపణలతో బురద జల్లుతూ డైవర్ట్ రాజకీయాలు చేస్తున్నాడన్నారు.

టీడీపీ హయాంలో 2014 నుంచి 2019 వరకు చేసిన అవినీతితో పాటు మీడియా సమక్షంలో తాను దేనిపైనైనా చర్చకు సిద్ధమన్నారు. ఆధారాలు మీడియాకు చూపించాలన్నారు. ప్రభుత్వం విశాఖపట్టణం నుంచి ట్యాంకర్ల ద్వారా ఆక్సిజన్ సరఫరా చేసిందేకాని, సిలిండర్లు ఎక్కడా ఉపయోగించ లేదన్నారు. కరోనా బాధితులకు ప్రభుత్వం, తాము చేసిన సహాయం ఎనలేనిదన్నారు. దీనిపై మాట్లాడేందుకు అరవిందబాబుకు నోరెలా వచ్చిందని ప్రశ్నించారు. హెటిరో సంస్థ ద్వారానే టీడీపీ వారికి చెందిన హాస్పిటల్స్‌కు కూడా రెడ్‌మిసివర్ ఇంజక్షన్లు సరఫరా అయ్యాయన్నారు. అరవిందబాబు అబద్ధాలు ఆడటంలో దిట్టని, పేషెంట్లకు రాడ్‌లు వేయకుండానే వేసినట్లుగా, అవసరంలేని చోట ఆపరేషన్లు చేసి డబ్బులు గుంజటం అలవాటేనన్నారు. కరోనా సమయంలో సీఎం రిలీఫ్ ఫండ్‌కు తాము రూ.1.20 కోట్లు ఇచ్చామని, ఎంతో మందికి నిత్యావసరాలు, కూరగాయలు పంపిణీ చేశామన్నారు. కేంద్ర ప్రభుత్వం హాస్పిటల్‌కు 90 వెంటిలేటర్లు ఇచ్చారని, అవి భద్రంగా ఉన్నాయన్నారు. తాము ఐసీయూ, ఏసీలు పెట్టించి 200 బెడ్లకు ఆక్సిజన్ సౌకర్యం కల్పించామన్నారు.

పురపాలక సంఘంలో ఏడాదికి వచ్చే ఆదాయం కంటే ఖర్చు రూ.6 కోట్లు అధికంగా ఉంటుందన్నారు. డబ్బు లేనిచోట అవినీతి ఎక్కడని ప్రశ్నించారు. చేసిన పనులకు కాంట్రాక్టర్లకు రూ.9 కోట్ల బిల్లుల చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. డబ్బులు లేక పనులు నత్తనడక నడుస్తున్నాయన్నారు. తాను 26 ఎకరాల అసైన్డ్ ల్యాండ్‌ను కబ్జాచేసి అమ్ముకుంటున్న ఆరోపించారని, తనపై ఒక్క సెంటు భూమి ఉంటే రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు.

ఆ వెంచర్‌లో అసైన్డ్ భూమి లో పార్కు అభివృద్ధి చేస్తున్నామన్నారు. టీడీపీ వారు రియల్ ఎస్టేట్, అపార్టు మెంట్ నిర్మాణం చేస్తే తప్పులేనిది అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు చేస్తే తప్పేంటని ప్రశ్నించారు. ధైర్యం, దమ్ము ఉంటే తనపై చేసిన ఆరోపణలకు ఆధారం చూపించాలని, చర్చకు వచ్చి ఇదేవిధంగా ఆధారాలు లేకుండా మాట్లాడితే పద్ధతిగా ఉండదని ఎమ్మెల్యే గోపిరెడ్డి హెచ్చరించారు. ముందు వచ్చే ఎన్నికల్లో అరవింద బాబుకు సీటుందో లేదో ముందు తేల్చుకోవాలని సలహా ఇచ్చారు.

లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలి

- జిల్లా కలెక్టర్ శివశంకర్
- హాస్టల్ విద్యార్థినులకు మంచాలు పంపిణీ



విద్యార్థినులకు మంచాలు అందచేస్తున్న కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట ఈస్ట్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని సాధించేందుకు సమయపాలనతో కూడిన క్రమశిక్షణతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ తెలిపారు. హార్ట్ జూనియర్ కళాశాలలో శనివారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డితో కలసి విద్యార్థినులకు ఐరన్ బెడ్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ, లక్ష్య సాధనలో విఫలమైనప్పటికీ లక్ష్యాలను ఉన్నతంగానే ఏర్పరుచుకోవాలని సూచించారు. విద్యార్థులకు దిశా నిర్దేశం చేసేదానిలో భాగంగా తాను విద్యార్థులతో డే-విత్ కలెక్టర్ కార్యక్రమం చేపట్టి విద్యార్థుల ఉన్నత లక్ష్య సాధనకు అవగాహన కల్పిస్తున్నట్టు వివరించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ, వసతి గృహంలోని విద్యార్థినులకు మంచాలు అందించటం అభినందనీయమన్నారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను విద్యార్థులు సద్వినియోగపరుచుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించి విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిందన్నారు. కార్యక్రమంలో పల్నాడుజిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్‌బాబు, తహసీల్దార్ రమణ నాయక్, హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ డైరెక్టర్ టి.ఆనంద్ బెంజిమన్ పాల్గొన్నారు.

జగనన్న హయాంలో బడుగులకు ప్రాధాన్యం

- రాష్ట్ర మాదిగ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు
- జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలేష్‌కు అభినందన



పాలేష్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్, కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు

వినుకొండ (నూజెండ్ల): ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ ప్రాధాన్యత లభిస్తోందని రాష్ట్ర మాదిగ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు వెల్లడించారు. పట్టణంలోని జాషువా కళాప్రాంగణంలో పల్నాడు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా నియమితులైన వినుకొండ మండలం నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పెద్దిటి పాలేష్‌కు శనివారం ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ హాజరయ్యారు. బలహీన వర్గాలు ఉన్నతంగా ఎదగాలంటే మంచి అలవాట్లను కలిగి ఉండి మంచి సంస్కృతిని అవలంభించాలని, పాలేష్ ఎల్లప్పుడు ప్రజలకు సేవ చేస్తుంటాడని, నలుగురు బాగుండాలని కోరుకునే మంచి వ్యక్తి అని అతిథులు కొనియాడారు. భవిష్యత్‌లో మరెన్నో పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం దళిత గిరిజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో మూక్ నాయక్ అవార్డు ప్రధానోత్సవం జరిగింది. కార్యక్రమంలో ఎంపీపీ మేడం జయరామిరెడ్డి, జడ్పీటీసీ జడ్డా సుబ్బులురామయ్య, 30వ కౌన్సిలర్ షకీలా, రెడ్డిబోయిన ప్రసన్నకుఆర్, చిలకల జాన్‌సుందర్, పిడుగు విజయబాబు, పిడతల దేవదాసు, బొజ్జ సుందర్‌రావు, నాలావత్ బర్మానాయక్, శాంతయ్య, మల్లవరపు రాజశేఖర్, అంగడి బాబు, అమృతపూడి హైగ్రాజు, సురేంద్రబాబు, జి.జీవన్‌కుమార్, చందోలు నాగవాణి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యం



మృతదేహాన్ని హైవేపై ఉంచి ఆనవాళ్లను సేకరిస్తున్న పోలీసులు

యడ్లపాడు: మండలంలోని తిమ్మాపురం 16వ నంబర్ జాతీయ రహదారి పక్కన గుర్తు తెలియని మృత దేహం శుక్రవారం పోలీసులు గుర్తించారు. చిలకలూరిపేట నుంచి గుంటూరు వెళ్లే తిమ్మాపురం బైపాస్ పనులు నిర్వహిస్తున్న ప్రాంతానికి సమీపంలో హైవే సైడ్ డివైడర్‌కు పది అడుగుల దూరంలో యువకుడి మృతదేహం లభ్యమైంది. శనివారం ఉదయం 9.3 గంటల సమయంలో ఆ మార్గాన వెళ్తున్న ఓ వ్యక్తి హైవే పెట్రోలింగ్ పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో యడ్లపాడు ఎస్‌ఐ రాంబాబు సిబ్బందితో సంఘటనా స్థలికి వెళ్లారు. మృతదేహం బాగా ఉబ్బి కుళ్లి దుర్గంధం వ్యాపిస్తూ ఆనవాళ్లను గుర్తించలేని విధంగా ఉందని తెలిపారు. అయితే చనిపోయిన వ్యక్తికి సుమారు 35 నుంచి 40 మధ్య వయస్సు కలిగి, మూడు, నాలుగు రోజుల కిందట మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. సుమారు 5.7 అడుగుల ఎత్తు కలిగి లైట్‌బ్లాక్ కలర్ నెక్ బనియన్, బ్లూకలర్ జీన్స్ ధరించి ఉన్నాడు. మృతుడి కుడిచేతి మణికట్టు వద్ద కాశీతాడు వంటి దారం కట్టి ఉంది. వెంటనే పల్నాడు జిల్లా నుంచి క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌ను తెప్పించి ఆధారాలను సేకరించారు. అనంతరం మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. ఇటీవల కనిపించకుండా పోయిన వారు ఎవరైనా ఉంటే వారి కుటుంబ సభ్యులు యడ్లపాడు ఎస్‌ఐ పైడి రాంబాబుకు సమాచారం అందించాలన్నారు. తను స్థానికుడా... ఇతర ప్రాంతానికి చెందిన వ్యక్తినా, తనే వచ్చి ఆత్మహత్య చేసుకున్నాడా..ఎవరైనా ఇక్కడి తెచ్చి హత్య చేశారా అనే కోణాల్లో పోలీసులు విచారణ చేపట్టారు.

దృఢమైన మనస్తత్వమే విజయానికి సోపానం

జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డి




కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట రూరల్: సానుకూల దృక్పథం, దృఢమైన మనస్తత్వం కలిగి ఉండటమే విజయానికి సోపానం అని జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి తెలిపారు. పెట్లూరివారిపాలెంలోని ఏఎంరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన బీటెక్ నాల్గవ సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు సభకు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విజయాన్ని సాధించే వరకు వెనుకడుగు వేయకుండా శ్రమించాలని విద్యార్థులకు సూచించారు. మానవ జీవితంలో విద్యార్థి దశ అత్యంత విలువైనదన్నారు. ఈ దశలో తీసుకున్న నిర్ణయాలు చదువు పట్ల చూపిన శ్రద్ధే విజయానికి కారణమవుతుందని తెలిపారు. విద్యార్థి జీవితంలో సఫలం అయ్యాడా, విఫలం అయ్యాడా అనేది చదువులో చూపిన ప్రతిభ ఆధారంగా నిర్ణయించబడుతుందన్నారు. మానసిక దృఢత్వం, సానుకూల దృక్పథం, నిరంతం కృషి విద్యార్థి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు దోహదపడుతుందని వివరించారు. విద్యార్థులు మానసిక స్థిరత్వం కలిగి ఉండి జీవితంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించాలని సూచించారు. జల్సాలకు, చెడు అలవాట్లకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. లోన్ యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, లోన్ యాప్‌ల బారిన పడి చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారని గుర్తుచేశారు.

కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి, డీఎస్పీ విజయభాస్కర్, రూరల్ సీఐ భక్తవత్సల రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి, డీన్ డాక్టర్ సురేఖ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహంకాళి అమ్మవారి తిరునాళ్ల



యాగశాలలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న దృశ్యం

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలో వేంచేసియున్న మహంకాళి అమ్మవారి దేవస్థానం 48వ తిరునాళ్ల మహోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పూలతో అలంకరించారు. అమ్మవారికి విశేష పూజలు, ప్రత్యేక అలంకరణలు జరిపారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు సమర్పించారు. మహిళలు పొంగళ్లు పొంగించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం అమ్మవారికి స్నపనం, గవ్యాంతము తదితర పూజలు జరిపారు. అనంతరం ప్రధాన కలశ ఆలయ ప్రవేశాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. యాగశాలలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని జరిపారు. పాడా చైర్మన్ మిట్టపల్లి రమేష్ పూర్ణాహుతిలో పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ గావించారు. అమ్మవారిని దర్శించుకునే భక్తులకు మజ్జిగ, రాగిజావ, పులిహోర ప్రసాదాలను పలు సంస్థలు అందజేశాయి. ఆలయ ఈవో టి.సుధాకరరెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆదిశైవ సంఘం అధ్యక్షులు యన మండ్ర సత్యసీతారామ శర్మ, ఆలయ అర్చక స్వాము లు కొత్తలంక కార్తికేయశర్మ, నందూరి కాశీకృష్ణ ఆధ్వర్యంలో పూజాదికాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేసారు. జొన్నలగడ్డ శ్రీరామమూర్తిచే భక్తిగీతాలు, శ్రీ సాయి అన్నమయ్య భాస్కర సంగీత కళాక్షేత్రం గాయనీ బి.చంద్రకళ కీర్తనలు భక్తులను అలరించాయి.

అహోరాత్రి మహా మృత్యుంజయ యాగం

వినుకొండ (నూజెండ్ల): పెరిగిపోతున్న అనారోగ్య సమస్యల పరిష్కారానికి వినుకొండ శాంతి ఆశ్రమం ట్రస్ట్ ఆధ్వర్యంలో సర్వలోక కల్యాణం చేసేందుకు వినుకొండ రూరల్ విఠంరాజుపల్లి గ్రామ శివారులోని సాయి బృందావనం నందు చేపట్టిన 72 గంటలపాటు అహోరాత్ర మహా మృత్యుంజయ యాగం హిమాలయ గురూజీచే శనివారం ప్రారంభించారు. ఈ నెల 14న మహా పూర్ణాహుతితో కార్యక్రమం ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పగడాల జయశ్రీ వెంకటరామిరెడ్డి,పెండేల పుల్లారావు, మోహన్‌రావు, సుధాకర్, ప్రవీణ్, ఎల్ఐసి వాసు, ఏరువా నాగ ముని కొండారెడ్డి, శ్రీనివాసరెడ్డి, కందుల లక్ష్మీరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

గర్భిణి ప్రాణం తీసిన ధనుర్వాతం!

యడ్లపాడు: వివాహమై 11 మాసాలు.. గర్భం దాల్చి 7 నెలలు. చక్కగా ఓ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న క్రమంలో స్పృహ తప్పింది.. ఆస్పత్రిలో చికిత్స అందిస్తుండగా ధనుర్వాతం సోకి మృతి చెందింది. బాధాకరమైన ఈ సంఘటన యడ్లపాడు మండలం చెంఘీజ్‌ఖాన్‌పేటలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు కథనం ప్రకారం.. పెదపలకలూరు గ్రామానికి చెందిన కొన్నెగంటి శ్రీనివాసరావు, రేణుకాదేవి కుమార్తె యామిని ప్రియాంక (23)ను చెంఘీజ్‌ఖాన్ పేటకి చెందిన బసెల రవీంద్రనాథ్ ఠాగూర్‌తో గతేడాది ఏప్రిల్‌లో వివాహమైంది. ఇద్దరు గుంటూరులో ఓ ప్రైవేటు సంస్థల్లో విధులు నిర్వహిస్తున్నారు. ప్రియాంక ఏడుమాసాల గర్భిణి. ఓ కార్పొరేట్ స్కూల్లో ఉపాధ్యాయురాలిగా పనిచేసే ప్రియాంక గురువారం సాయంత్రం కళ్లు తిరిగి పడిపోయింది. జీజీహెచ్‌కు తరలించి చికిత్స నిర్వహిస్తుండగా ధనుర్వాతం సోకి శుక్రవారం మృతి చెందింది. కడుపులో ఉన్న 7 నెలల శిశువు మృతి చెందింది. మృతదేహాన్ని శనివారం చెంఘీజ్‌ఖాన్‌పేటకు తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం తెలిసిన గుంటూరు-కృష్ణాఎన్టీఆర్ జిల్లాల వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ మర్రి రాజశేఖర్ కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు అంబటి బ్రహ్మం, బసెల ఆదిత్య, చాతరాజుపల్లి శ్రీనివాస రావు, నల్లగొర్ల శ్రీనివాసరావు తదితరులు ఆయన వెంట ఉన్నారు.

గంజాయి కలిగి ఉన్న ముగ్గురి అరెస్ట్

నరసరావుపేట టౌన్: అక్రమంగా గంజాయి కలిగి ఉన్న కేసులో ముగ్గురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 7.50 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ ఎస్‌ఐ రహంతుల్లా శనివారం తెలిపారు. మార్కెట్ యార్డు సమీపంలో అక్రమంగా గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. అక్కడ పెదచెరువు ప్రాంతానికి చెందిన సుభాని, రసూల్, ఇస్లాంపేటకు చెందిన సుల్తాన్ ముగ్గురుని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బడ్డీ దుకాణాల్లో చోరీ

యడ్లపాడు: మండలంలోని రెండు గ్రామాల్లో దొంగలు హల్‌చల్ చేశారు. రెండు బడ్డీ కొట్ల షట్టర్ తాళాలు పగుల గొట్టి అందులోని రూ.47 వేలు నగదుతో పాటు తినుబండారాలు, నూనె వస్తువులు, కూల్‌డ్రింక్స్ తదితర చిరుతిండి వస్తువుల్ని ఎత్తుకుపోయారు. బాధితుల కథనం ప్రకారం.. కొండవీడు-ఫిరంగిపురం మార్గంలో కొత్తపాలెం గ్రామానికి వెళ్లే మలుపు వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కనే ఉన్న చొప్పర అంజమ్మ బడ్డీకొట్టులో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. రాత్రి 7 గంటల సమయంలో దుకాణం మూసి తెల్లవారాక వచ్చి చూస్తే షట్టర్ తాళాలు, కొట్టులోని డబ్బులు దాచుకునే ముంత పగిలి ఉండటం చూసి షాపు తెరిచి చూసింది. గల్లాపెట్టె, పప్పుడబ్బాలో, ముంతలో దాచుకున్న రూ.40 వేలు మాయం కాగా, కూల్‌డ్రింక్స్, సున్నిండలు, కొబ్బరిలవుజు ప్యాకెట్లు దుండుగులు మాయం చేసినట్లు గుర్తించింది.

సంతపేటలో...

అదేమార్గంలోని సంతపేట మర్రిచెట్టువద్ద పాశం పద్మ తన బడ్డీకొట్టును శుక్రవారం రాత్రి 9 గంటలకు మూసి వెళ్లింది. వేకువజామున వచ్చి చూస్తే తాళాలు పగులగొట్టి పక్క కాల్వలో కనిపించాయి. షాపు తెరిచిచూస్తే రూ.7 వేల నగదు, సబ్బులు, పేస్టులు, కూల్‌డ్రింక్ ఆయిల్ డబ్బాలు సుమారు రూ.4 వేల విలువైనవి అపహరించుకు పోయినట్లు గుర్తించింది. వీరిద్దరూ యడ్లపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

యడ్లపాడు: ఆస్తి వివాదాల నేపథ్యంలో వివాహిత ఆత్మహత్యాయత్నంకు పాల్పడిన సంఘటన శుక్రవారం రాత్రి మండలంలో జరిగింది. బాధితురాలి వివరాల ప్రకారం ..మండలంలంలోని సందెపూడి పంచాయతీ శివారుగ్రామం గణేశునివారి పాలెంకు చెందిన ఒంటిపులి వీరయ్య, భూలక్ష్మి దంపతులకు అంకమ్మరావు, శ్రీనివాసరావు, ఆంజనేయులు ముగ్గురు సంతానం ఉన్నారు. తండ్రి మరణాంతరం వారసత్వంగా రావాల్సిన ఆస్తి పంపకాల విషయంలో అన్నదమ్ముల మధ్య కొంతకాలంగా వివాదం కొనసాగుతోంది. ఇటీవల అరెకరంలో సాగు చేసిన శనగపంటను తన పిన్ని అంజమ్మ ఇంట్లో నిల్వ ఉంచాడు. గత శనివారం తమ్ముడు ఆంజనేయులు ఆ ఇంటి తాళం పగులగొట్టి పంటను తరలించుకు వెళ్లడంతో పాటు అడ్డుకున్న వదిన భాగ్యలక్ష్మిపై దాడికి పాల్పడ్డాడు. దంపతులిద్దరు యడ్లపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం పట్ల సోదరుల మధ్య ఘర్షణ జరిగింది. మనస్తాపం చెందిన అంకమ్మరావు భార్య భాగ్యలక్ష్మి శుక్రవారం రాత్రి పురుగుల మందు సేవించింది.

